సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 24 । మార్చి । 2024



..కల్యాణానికి వేళాయె
ఇల్లెందు మండలం నాయకులగూడెం, కొమరారం గ్రామాల్లో శ్రీ రాధాకృష్ణుల కల్యాణ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.
8లో



ఆటాడుకుందాం.. రా!
కొత్తగూడెం, పాల్వంచలో అత్యాధునిక టెన్నిస్ కోర్టులు సిద్ధం కావడంతో ఔత్సాహిక క్రీడాకారులకు మేలు జరగనుంది.
10లో

గరిష్టం / కనిష్టం
38° / 23°

వాతావరణం
జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి. రాత్రి పూట వాతావరణం కొంత చల్లబడుతుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆదివారం సా॥) 6.26
సహర్ (సోమవారం ఉ॥) 4.47

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యజ్ఞాచార్యులు ప్రతాపురం గిరిధరాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రసాదాచార్యులు తదితరులు ఆరాధన, విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ మేనేజర్ వెంకట రమణ ఏర్పాట్లు చేశారు.

పరీక్ష కేంద్రాల్లో డీఈఓ తనిఖీ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల కేంద్రాలతోపాటు, మండలంలోని సున్నంబట్టి ఐటీడీఏ గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలను డీఈఓ వెంకటేశ్వరాచారి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద సౌకర్యాలపై ఆరా తీశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఈఓ వెంట ఏసీజీజీ మాధవరావు, చీఫ్ సూపరింటెండెంట్ హరిత, డిపార్ట్‌మెంటల్ అధికారులు ఉన్నారు.

నాలుగో రోజు 80 మంది గైర్హాజరు..
కొత్తగూడెంఅర్బన్ : జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో నాలుగో రోజైన శనివారం 80 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ వెంకటేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 12,341 మందికి 12,291 మంది, ప్రైవేటు విద్యార్థులు 319 మందికి 289 మంది మాత్రమే పరీక్షలు రాశారని వివరించారు. తాను ఆరు కేంద్రాలను తనిఖీ చేశానని, 28 సెంటర్లలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయని పేర్కొన్నారు. జిల్లాలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

తానా సభలకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందిస్తున్న ప్రతినిధులు

అశ్వారావుపేట: మే 24 నుంచి 26 వరకు అమెరికాలో తెలంగాణ అమెరికా తెలుగు సంఘాల ఆధ్వర్యంలో జరుగనున్న తానా మహాసభకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఆహ్వానం అందింది. ఈ మేరకు మహాసభల ఆర్గనైజింగ్ సీఈఓ దూళిపాల జ్యోతిరెడ్డి శనివారం హైదరాబాదులో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రిక అందించారు.



'అఫిడవిట్'పై మళ్లీ చర్చ..

- గతంలో జలగం – వనమా మధ్య వివాదం
- రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీసిన కొత్తగూడెం అసెంబ్లీ
- అఫిడవిట్‌లో తప్పుడు వివరాలంటూ న్యాయస్థానంలో వ్యాజ్యాలు
- తాజాగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనికి హైకోర్టు నోటీసులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శాసనసభ ఎన్నికల ప్రక్రియ సందర్భంగా అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో సరైన వివరాలు అందించలేదనే వ్యాజ్యంపై వివరణ ఇవ్వాలంటూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు రాష్ట్ర హైకోర్టు నోటీసులు పంపింది. దీంతో మరోసారి అఫిడవిట్ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

జలగం వర్సెస్ వనమా..
తెలంగాణ అసెంబ్లీకి రెండోసారి 2018లో జరిగిన ఎన్నికల సందర్భంగా కొత్తగూడెం స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున జలగం వెంకటరావు, కాంగ్రెస్ నుంచి వనమా వెంకటేశ్వరరావు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో జలగంపై వనమా గెలుపొందారు. అయితే నామినేషన్ సందర్భంగా వనమా సరైన వివరాలు సమర్పించలేదంటూ జలగం వెంకటరావు వెంటనే హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన తర్వాత 2023 జూన్‌లో వనమా ఎన్నిక చెల్లదంటూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దీంతో ఆ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన తనను ఎమ్మెల్యేగా గుర్తించాలని శాసనసభ కార్యదర్శిని జలగం వెంకటరావు కోరారు. ఇంతలో హై కోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వనమా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ అంశం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

ఆరుగురిలో ఒకరు..
వనమా వర్సెస్ జలగం వివాదం సుప్రీంకోర్టులో ఉండగానే గతేడాది నవంబర్ 30న తెలంగాణ అసెంబ్లీకి మూడోసారి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున వనమా వెంకటేశ్వరరావు పోటీ చేయగా, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున జలగం వెంకటరావు పోటీ చేశారు. అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం సాధించారు. కాగా, నామినేషన్ అఫిడవిట్‌లో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు సరైన వివరాలు వెల్లడించలేదంటూ నందూలాల్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. కొత్తగూడెంతో పాటు మరో ఐదు శాసనసభ స్థానాలకు సంబంధించి ఈ తరహా వ్యాజ్యాలు కోర్టులో దాఖలయ్యాయి. దీనిపై స్పందించిన న్యాయస్థానం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనితో పాటు మిగతా ఐదుగురికి నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

అప్పటి నుంచే రగడ..
జలగం వర్సెస్ వనమా కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో ఈసారి ఎన్నికల సందర్భంగా నామినేషన్ల అంశంపై అన్ని పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. బీఆర్ఎస్ అయితే రాష్ట్ర కార్యాలయంలో నామినేషన్ పత్రాలు నింపేందుకు, సరి చూసుకునేందుకు ప్రత్యేక శిబిరం నిర్వహించింది. ఇక కొత్తగూడెం విషయానికి వస్తే నామినేషన్ దరఖాస్తుల పరిశీలన గరం గరంగా జరిగింది. ఈ స్థానం నుంచి మొత్తం 36 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు, బీఎస్పీ అభ్యర్థి వై. కామేశ్‌తో పాటు మరికొందరు అభ్యర్థులు అఫిడవిట్‌లో సమర్పించిన అంశాలపై మరో అభ్యర్థి జలగం వెంకటరావు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో ఎన్నికల అధికారులు రాష్ట్ర అధికారులతో సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. కాగా ఇప్పుడు హై కోర్టులో వ్యాజ్యం దాఖలు కావడంతో మరోసారి అఫిడవిట్ అంశంపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.



గోదావరి వరదలతో నీట మునిగిన పంటలు (ఫైల్)

మా సంగతేంటి ?

- భద్రాచలంలో కరకట్టల నిర్మాణాలు
- బూర్గంపాడు వైపు పెరగనున్న వరద ముంపు
- ఏటా ముంచెత్తుతున్న గోదావరి ప్రవాహం
- ఇళ్లు, పంటలు నీటి పాలవుతున్న వైనం

బూర్గంపాడు: గోదావరి వరదల నుంచి భద్రాచలం పట్టణానికి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కరకట్టల నిర్మాణం చేపట్టింది. గతంలోనే భద్రాచలానికి 80 శాతం మేర కరకట్ట ఉండగా.. మిగతా 20 శాతం మేర నిర్మాణాలను ఇటీవల ప్రారంభించారు. అయితే భద్రాచలంతో పాటు బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాల్లోనూ వరద ముంపు సమస్య తీవ్రంగా ఉంటుంది. గోదావరి వరదలతో ముఖ్యంగా బూర్గంపాడు మండలానికే ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. వేల ఎకరాల్లో పంటలు, వేల సంఖ్యలో ఇళ్లు వరద ముంపునకు గురవుతాయి. మండల కేంద్రంతో పాటు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, సారపాక, తాళ్ల గొమ్మూరు, కోయగూడెం, మోతె, ఇరవెండి గ్రామ పంచాయతీలు పూర్తిగా నీట మునుగుతాయి. అశ్వాపురం మండలంలోని పలు గ్రామాలు, మణుగూరు, పినపాక మండలాల్లోని కొన్ని గ్రామాలు వరద ముంపు బారిన పడతాయి. మణుగూరులోని బీటీపీఎస్‌కు కూడా ముంపు ప్రభావం ఉంటుంది. వరదలు వచ్చిన ప్రతిసారీ ముఖ్యమంత్రి, మంత్రులు గోదావరి కరకట్టల ప్రస్తావన తీసుకురావడం, ఆ తరువాత మరిచిపోవడం పరిపాటిగా మారింది.

వైఎస్ మరణంతో అటకెక్కిన ప్రతిపాదనలు..
1986లో గోదావరికి గరిష్టంగా 76.5 అడుగుల మేర వరద వచ్చింది. దీంతో ప్రజలంతా భయాందోళనకు గురయ్యారు. వరద ముంపుతో బాధితులు కట్టుబట్టలతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. వందల సంఖ్యలో పశువులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. బూర్గంపాడు మండలంలో మూడొంతుల గ్రామాలు పూర్తిగా నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలు పూర్తిగా నిరాశ్రయులయ్యాయి. దీంతో నాటి ప్రభుత్వం బూర్గంపాడులోని కొందరికి గౌతమీపురంలో కొత్తగా ఇళ్ల స్థలాలిచ్చింది. గోదావరి ఒడ్డున ఉన్న పాత గొమ్మూరు గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేయించి నాగినేనిప్రోలులో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇక 2006లో వచ్చిన గోదావరి వరదలు మళ్లీ ప్రజలను భయాందోళనలకు గురిచేశాయి. 70 అడుగులు మేర వచ్చిన వరదలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ బూర్గంపాడు మండలంలోని మోతె గ్రామానికి వచ్చి పరిశీలించారు. బూర్గంపాడు వైపు కరకట్ట నిర్మాణానికి సర్వే నిర్వహించాలనే వైఎస్ ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేసి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఇక మహానేత మరణానంతరం కరకట్ట నిర్మాణాల ప్రతిపాదనలు అటకెక్కాయి. ఇక 2022లో గోదావరి వరదలు 73.5 అడుగుల మేర రాగా, బూర్గంపాడు మండలంలో వేల సంఖ్యలో ఇళ్లు, వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. దీంతో అప్పటి సీఎం కేసీఆర్ సైతం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి కరకట్టలు నిర్మిస్తామని, ముంపు ప్రాంత వాసులకు మెరక ప్రాంతాలలో ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీలు కూడా అమలుకాలేదు. గోదావరి వరదలతో జరిగిన పంట నష్టాన్ని, దెబ్బతిన్న ఇళ్లను, రహదారులను కేంద్ర బృందం పరిశీలించింది. భద్రాచలం ఐటీడీఏలో వరద ముంపు నష్టాల ఫొటో ఎగ్జిబిషన్‌ను కూడా కేంద్ర బృందం పరిశీలించింది. ఇక్కడ పరిస్థితులను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పి వెళ్లింది. కానీ కేంద్రం నుంచి ఎలాంటి సానుకూల ప్రకటన రాలేదు. ఇలా.. ఏటా వస్తున్న గోదావరి వరదలతో ఆస్తినష్టం జరుగుతోందని ముంపు ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. భద్రాచలం వైపు పూర్తిస్థాయిలో కరకట్టలు నిర్మిస్తే బూర్గంపాడు మండలానికి వరద తీవ్రత ఇంకా పెరుగుతుందని ఇక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటు కూడా కరకట్టలు నిర్మించాలని కోరుతున్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణ పక్కాగా ఉండాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



డంపింగ్ యార్డు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీఓ

బూర్గంపాడు: పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో ఘన వ్యర్థాల నిర్వహణను పక్కాగా చేపట్టాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. సారపాకలోని డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతివనం, నర్సరీ, వైకుంఠధామాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, పొడి చెత్తను గ్రేడింగ్ చేసి రీసైక్లింగ్‌కు వినియోగించాలని సూచించారు. తడి చెత్త నుంచి వర్మికంపోస్ట్ తయారు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డు విస్తరణకు చర్యలు చేపట్టాలన్నారు. భద్రాచలం రామాలయానికి దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులు సారపాక నుంచే వెళ్లాల్సి ఉందని, ఇక్కడి రహదారులు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. చెత్త సేకరణలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రెయినేజీలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పల్లె ప్రకృతి వనంలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నర్సరీల్లో మొక్కలకు నిత్యం నీరు పడుతుండాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మహేష్, సిబ్బంది ఉన్నారు.

జెన్‌కో నిర్ణయం హర్షణీయం

పాల్వంచ : రెండో కారుణ్య నియామకాల ప్రక్రియకు జెన్‌కో గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఏఐటీయూసీ (హెచ్64) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రావుల మురళి, దుగ్గిరాల సుధాకర్, 1104 యూనియన్ రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. జీఓ నంబర్ 6 రద్దుతో ఎన్నో ఏళ్లుగా రెండో కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్న బాధిత కుటుంబాల్లో ఇప్పుడు సంతోషం నెలకొందని తెలిపారు. సానుకూల నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిఘా..





మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు, పాల్గొన్న పోలీస్ అధికారులు

- ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని చెప్పారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ యంత్రాంగంతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించాలని అన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్‌లు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. సైబర్ నేరాల్లో నగదు కోల్పోయిన బాధితులు వెంటనే ఫిర్యాదు చేస్తే నగదును హోల్డ్‌లో పెడతారని ఎస్పీ తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టి.సాయిమనోహర్‌తోపాటు బాబు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అమరులకు ఘన నివాళి..



కాగడాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న పాల్వంచ గురుకుల విద్యార్థులు

9లో

బ్రిటిష్ వారి చెర నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు ఎంతోమంది మహనీయులు ప్రాణత్యాగం చేశారు. అందులో అతి చిన్న వయసులోనే ఉరికంబం ఎక్కిన విప్లవవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శనలు చేపట్టారు.

'స్థానిక' సమస్య పట్టదా..?

- అదనపు కలెక్టర్ లేక కొరవడిన పర్యవేక్షణ
- ఇన్‌చార్జ్ పాలనతో నెట్టుకొస్తున్న వైనం
- స్థానిక సంస్థల పాలనపై తీవ్ర ప్రభావం



కలెక్టరేట్ సముదాయం

చుంచుపల్లి: జిల్లా పరిపాలనలో కలెక్టర్ తర్వాత అదే స్థాయిలో ఉండే కీలకమైన అదనపు కలెక్టర్ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంటోంది. జిల్లా అభివృద్ధిలో కలెక్టర్‌కు సహకరించే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అందుబాటులో లేక కీలక నిర్ణయాలు తీసుకునే క్రమంలో జాప్యం జరుగుతోంది. దీంతో స్థానిక సంస్థల పరిపాలనపై పట్టింపు కరువైందని పలువురు ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 10న జాయింట్ కలెక్టర్ పోస్టును రద్దు చేసి ఆ స్థానంలో కొత్తగా రెవెన్యూ, స్థానిక సంస్థలు అనే రెండు విభాగాలుగా వర్గీకరించి వాటికి అదనపు కలెక్టర్లను నియమించింది. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల పనితీరును పటిష్టం చేసేందుకు ప్రత్యేకంగా ఒక అదనపు కలెక్టర్ పోస్టును సృష్టించింది. అయితే జిల్లాలో కొన్ని నెలలుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉండడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నారు. గతేడాది జూలై నుంచి జిల్లాలో స్థానిక సంస్థలకు అదనపు కలెక్టర్ లేకపోవడంతో డీఆర్‌డీఓల ఇన్‌చార్జ్ పాలనతోనే నెట్టుకొస్తున్నారు. 2019లో జిల్లాకు ట్రైనీ కలెక్టర్‌గా వచ్చిన దురిశెట్టి అనుదీప్ 2020 జూలై నుంచి స్థానిక సంస్థలకు అదనపు కలెక్టర్‌గా వ్యవహరించారు. ఇదే క్రమంలో అప్పటి కలెక్టర్ ఎం.వి.రెడ్డి ఉద్యోగ విరమణతో 2021 జూన్ 1న కలెక్టర్‌గా అనుదీప్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్వయంగా కలెక్టర్‌గానే కాకుండా స్థానిక సంస్థలను కూడా పర్యవేక్షించేవారు. దురిశెట్టి అనుదీప్ గతేడాది జూలైలో బదిలీ కావడంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పోస్టు ఖాళీ అయింది. దీంతో ఆ తర్వాత బదిలీపై వచ్చిన కలెక్టర్ ప్రియాంక అల గతేడాది జూలై 22న అప్పటి డీఆర్‌డీఓ మధుసూదన్ రాజుకు అదనపు కలెక్టర్ బాధ్యతలను అప్పగించారు. కొన్ని నెలల పాటు అదనపు కలెక్టర్ బాధ్యతలను చూసిన ఆయన ఇటీవల బదిలీ కావడంతో మళ్లీ కొన్ని రోజుల పాటు పోస్టు ఖాళీగానే ఉంది. జిల్లాకు బదిలీపై కొత్తగా వచ్చిన డీఆర్‌డీఓ విద్యాచందనకు నాలుగు రోజుల క్రితం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బాధ్యతలను తిరిగి కలెక్టర్ అప్పగించారు. జిల్లాలో కీలకమైన అదనపు కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో స్థానిక సంస్థల పాలనపై తీవ్ర ప్రభావం పడుతుందని పలువురు అంటున్నారు. ముఖ్యంగా గత ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లిన పల్లె పాలనపై పర్యవేక్షణ కొరవడటంతో గ్రామ పాలన అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్థానిక పాలనపై ప్రభావం..
నూతన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల పకడ్బందీ అమలుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అదనపు కలెక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చింది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా స్థానిక సంస్థలకు జూనియర్ ఐఏఎస్‌లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను అదనపు కలెక్టర్లుగా నియమించింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో స్థానిక సంస్థలకు అదనపు కలెక్టర్లను నియమించి ప్రత్యేక అధి కారాలు కల్పించారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలోనే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పని చేస్తారు. నూతన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల ప్రకా రం అభివృద్ధి పనులు చేపట్టడం, అవినీతి, అక్రమాలు జరగకుండా చూడడం అదనపు కలెక్టర్ విధులు. స్థానిక సంస్థల్లో కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించి రాబడి పెంచడం, వచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేయించడం వంటివి అదనపు కలెక్టర్ చూస్తారు. జిల్లా పరిషత్, పంచాయతీ, మున్సిపల్, ఎస్సీ కార్పొరేషన్, మత్స్యశాఖ, వ్యవసాయం, మార్కెటింగ్‌తో పాటు ఇతర శాఖలు కొన్ని స్థానిక సంస్థల పరిధిలోకి వస్తాయి. వీటన్నింటిపై అదనపు కలెక్టర్ పర్యవేక్షణ ఉంటుంది. వీరు ప్రధానంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి, పనులు పరిశీలించి కలెక్టర్లకు, ప్రభుత్వానికి నివేదించడం, పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం ప్రధాన ఉద్దేశం. కిందిస్థాయి అధికారుల పనితీరుపై పర్యవేక్షణ, ప్రజాప్రతినిధులు చట్ట ప్రకారం పనిచేస్తున్నారా లేదా చూడటం వంటివి ప్రధాన విధులు. స్థానిక సంస్థల కౌన్సిల్ బడ్జెట్ సమావేశాలకు హాజరు కావడం, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పనిచేయకుంటే ప్రజాప్రతినిధులు, కింది స్థాయి అధికారులపై చర్యలు తీసుకునే అధి కారాన్ని కూడా ఇచ్చారు. స్థానిక సంస్థలపై పర్యవేక్షణలో భాగంగా అదనపు కలెక్టర్లు జిల్లాలో ప్రయాణించడానికి అవసరమైన వాహనంతో పాటు ప్రతి అదనపు కలెక్టర్ పరిధిలో రూ.25 లక్షల వరకు నిధులను సైతం అందుబాటులో ఉంచారు. గత మూడేళ్లుగా స్థానిక సంస్థలకు, ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. స్థానిక సంస్థల పనితీరు మెరుగుపడటంతో పాటు పల్లెప్రగతి, పట్టణ ప్రగతి విజయవంతంగా కొనసాగేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు దోహదపడుతున్నారు. కొన్ని నెలలుగా స్థానిక సంస్థలకు అదనపు కలెక్టర్ లేకపోవడంతో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజా పరిషత్‌లపై పరిపాలనా పరంగా తీవ్ర ప్రభావం పడుతోందని ప్రజాప్రతినిధులు అంటున్నారు. గ్రామసభలు, సర్వ సభ్య సమావేశాలు నామమాత్రంగా ముగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థలను పట్టించుకోకపోతే నిర్వీర్యమయ్యే ప్రమాదముందని వాపోతున్నారు.

క్లుప్తంగా

ఇసుక నిల్వలు సీజ్..



ఇసుకను సీజ్ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో ఇసుక అక్రమ రవాణా.. అక్రమార్జనపై శనివారం 'సాక్షి' దినపత్రికలో 'కాసులు కురిపిస్తున్న ఇసుక' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పోలీస్, రెవెన్యూ శాఖాధికారులు దివాణం వద్ద ఉన్న ఇసుక నిల్వలను సీజ్ చేశారు. అశ్వారావుపేట గిర్దావర్ (ఆర్ఐ) కృష్ణ, ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఇసుక నిల్వలను పరిశీలించి ఎలాంటి అనుమతులు లేవని, సుమారు 106.55 క్యూబిక్ మీటర్ల ఇసుకగా నిర్ధారించి సీజ్ చేశారు. ఇసుకను స్వాధీనం చేసుకున్నామని, నిబంధనల ప్రకారం తదుపరి నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణప్రసాద్ తెలిపారు.

రామయ్యకు గోటి తలంబ్రాలు సిద్ధం



గోటి తలంబ్రాలతో భక్తులు

దమ్మపేట: శ్రీసీతారాముల కల్యాణం నిమిత్తం స్థానిక శ్రీసీతారామ భక్త కమిటీ ఆధ్వర్యంలో చేతివేళ్లతో ఒలిచిన గోటి తలంబ్రాలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా భక్త కమిటీ అధ్యక్షురాలు మురహరి సత్యావతి మాట్లాడుతూ.. కమిటీలోని సభ్యులతో ముక్కోటి ఏకాదశి పర్వదినాన అత్యంత భక్తిశ్రద్ధలతో గోటి తలంబ్రాలను ఒలవడం ప్రారంభించి శనివారం నాటికి పూర్తి చేశామని తెలిపారు. ఎనిమిదేళ్లుగా గోటి తలంబ్రాలను భద్రాద్రి రాముడికి పంపుతున్నామని, సోమవారం వీటిని అందజేస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మురహరి గంగ, సరస్వతి, అర్చన, రాగిణి, భ్రమరాంబ, అత్తులూరి కుమారి, కందుకూరి విజయ, సీతారత్నం, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ ప్రశ్నపత్రం బయటకు వచ్చిందంటూ ప్రచారం

కూసుమంచి: కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్ష కేంద్రం నుండి శనివారం గణితం ప్రశ్నపత్రం బయటకు వచ్చినట్లు ప్రచారం జరిగింది. పరీక్ష ప్రారంభమైన గంట తర్వాత ఓ విద్యార్థి మూత్రశాలకు వెళ్తూ ప్రశ్నాపత్రాన్ని తీసుకెళ్లి గోడ బయట ఉన్న ప్రైవేట్ పాఠశాలల వారికి ఇచ్చాడని, వారు ఫొటో తీశారంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మను వివరణ కోరగా ఈ కేంద్రాన్ని 11 గంటల ప్రాంతంలో తాను తనిఖీ చేసి సుమారు అరగంటకు పైగా ఉన్నానని, ప్రశ్నాపత్రం బయటకు వచ్చిందనే ప్రచారం అవాస్తవని తెలిపారు. పరీక్షలు సీసీ కెమెరాల నిఘా నడుమ నిర్వహిస్తున్నందున విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురికావొద్దని సూచించారు. కాగా, వదంతులను వ్యాప్తి చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కేసు నమోదు

దమ్మపేట: వ్యవసాయ భూమిలో సాగును అడ్డుకుని, బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్.పురం మండలం రేఖపల్లి గ్రామానికి చెందిన కొట్టి జానకి.. దమ్మపేట మండలంలోని చిన్నగొల్లగూడెం గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 15న మొక్కజొన్న పంటకు సంబంధించిన పనులు చేస్తోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ముత్తిన సీతయ్య వ్యవసాయ క్షేత్రంలోకి అక్రమంగా ప్రవేశించి, మొక్కజొన్న పంట సాగుని అడ్డుకుని, ఆమెను అసభ్య పదజాలంతో దూషించడమే గాక బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

చేపల కోసం బాంబులతో వేట

తిరుమలాయపాలెం: మండలంలోని తిప్పారెడ్డి గూడెం చెరువు ఆవరణలో ఉన్న తాగునీటి బావిలో చేపలు పట్టేందుకు కొందరు బాంబు వేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎండలు ముదురుతుండగా, తాగునీటికి ఇక్క ట్లు ఎదురుకాకుండా బావిని శుభ్రం చేయడం మొదలుపెట్టారు. ఈక్రమంలో చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు అందులో శుక్రవారం రాత్రి బాంబులు వేసినట్లు తెలిసింది. ఈ విషయమై గ్రామస్తులు ఫిర్యాదు చేయగా ఎస్ఐ గిరిధర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. బావిలో చేపలు చనిపోయి దుర్వాసన వస్తుండడంతో శుభ్రం చేయాలని వారు సూచించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,045

రాధాకృష్ణుల కల్యాణానికి వేళాయె

ఆ రెండు గ్రామాల్లో సందడే సందడి..

- మొదట దేవుడి పెళ్లి.. ఆ తర్వాతే హోలీ..
- కొమరారం, నాయకులగూడెంలో ముస్తాబైన ఆలయాలు
- నేటి నుంచి వేడుకలు షురూ..



ముస్తాబైన నాయకులగూడెం రాధాకృష్ణుల ఆలయం



కొమరారం ఆలయంలో రాధాకృష్ణుల విగ్రహాలు

ఇల్లెందురూరల్: అందరూ హోలీ వేడుకలు జరుపుకుంటున్న వేళ ఆ గ్రామంలో దేవుడి కల్యాణం నిర్వహించడం.. ఆ తర్వాతే హోలీ ఆడడం అక్కడి ఆచారం. మండలంలోని నాయకులగూడెం, కొమరారం గ్రామాల్లో హోలీ రోజు రాధాకృష్ణుల కల్యాణం నిర్వహిస్తుంటారు. ఇందుకోసం ఆలయాలను సుందరంగా అలంకరించారు.

గిరిధారికి ఆదివాసీల పూజలు

గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన శ్రీకృష్ణుడికి నాయకులగూడెంలో 50 ఏళ్ల క్రితం ఆదివాసీ తెగకు చెందిన చాపల ముత్తయ్య శ్రీకృష్ణుడి ఆలయం నిర్మించారు. నాటి నుంచి నాలుగు దశాబ్దాలపాటు ఆదివాసీలే పూజలు చేస్తూ.. హోలీ రోజున స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తుండేవారు. కాగా, గత పదేళ్లుగా ఆదివాసీలతో పాటు ఇతర కులాల వారు కూడా రాధాకృష్ణులకు పూజ చేస్తూ కల్యాణ మహోత్సవానికి హాజరవుతున్నారు. ఇక కొమరారంలో కోరం కోటమ్మ అనే మహిళ శ్రీకృష్ణుడిపై భక్తితో తన సొంత ఖర్చులతో రాధాకృష్ణుల ఆలయం నిర్మించారు. ఇక్కడ కూడా హోలీ పండుగ రోజున రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ.

సంక్రాంతి రోజు నిశ్చితార్థం..

నాయకులగూడెం, కొమరారం గ్రామాల్లో రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవ ముహూర్తాన్ని ప్రతి సంవత్సరం సంక్రాంతి రోజున నిర్ణయిస్తారు. ఆ రోజునే రాధాకృష్ణుల వివాహ నిశ్చితార్థ వేడుకను ఘనంగా నిర్వహిస్తారు. ఆ నిర్ణయం మేరకు హోలీ పండుగ రోజున రాధాకృష్ణుల కల్యాణం జరిపిస్తారు. అంగరంగ వైభవంగా జరిగే రాధాకృష్ణుల కల్యాణాన్ని తిలకించేందుకు భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నాయకులగూడెం, కొమరారం ఆలయ కమిటీల ప్రతినిధులు చాపల కృష్ణ, కోరం కోటమ్మ తెలిపారు.

నేటి నుంచి ఉత్సవాలు..

మండలంలోని కొమరారం, నాయకులగూడెం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం తలంబ్రాల బియ్యం సేకరణ, గ్రామదేవతలకు బోనాల సమర్పణతో జాతర ప్రారంభమవుతుంది. సోమవారం ఉదయం 7:30 గంటలకు సుప్రభాత సేవ, 8:30కు పంచామృతాభిషేకం, నిత్యపూజ, గోత్రనామార్చన, తీర్థప్రసాద వితరణ, 9:30కు గణపతిపూజ, స్వామివారికి ఉపనయనం, అమ్మవారికి గౌరీపూజ, 11:30 గంటలకు స్వామివార్లకు ఎదుర్కోలు, మధ్యాహ్నం 1:15 గంటలకు స్వామి వారి కల్యాణం, అనంతరం మహానైవేద్యం, సాయంత్రం రాధాకృష్ణుల గ్రామోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తారు.

నలభై ఏళ్లుగా చేస్తున్నాం



గ్రామంలో నలభై ఏళ్ల క్రితం రాధాకృష్ణులపై భక్తితో ఆలయాన్ని నిర్మించుకున్నాం. నాటి నుంచి భక్తులతో పూజలందుకుంటున్న రాధాకృష్ణులకు హోలీపండుగ రోజున వైభవంగా కల్యాణం నిర్వహిస్తున్నాం. ప్రారంభంలో గ్రామస్తులే హాజరైన ఈ వేడుకకు క్రమంగా ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివస్తున్నారు. దీంతో జాతర మహోన్నతంగా సాగుతోంది.

– కోరం కోటమ్మ, ఆలయ పూజారి, కొమరారం

దేవాదాయ శాఖ ఉద్యోగులకు అదనపు బాధ్యతలు

ఖమ్మంగాంధీచౌక్/నేలకొండపల్లి: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఈఓగా పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన పి.నారాయణాచార్యులు బాధ్యతలను ఆ శాఖకు చెందిన ఇద్దరు ఈఓలు, ఓ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. కూసుమంచి మండలం జీళ్లచెరువు శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాల జరిగిన విషయమై నారాయణాచార్యులును కమిషనర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఆయన కూసుమంచి, నేలకొండపల్లి,ముదిగొండ మండలాల్లో పలు ఆలయాలకు ఈఓగా వ్యవహరిస్తుండగా ఆ స్థానంలో ఇతర అధికారులను ఇన్‌చార్జ్‌లుగా శనివారం నియమించారు. ఖమ్మం శ్రీ లక్ష్మీనర్సింహస్వామి(గుట్ట) దేవస్థానం ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావుకు జీళ్లచెరువు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయాల బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం పర్ణశాల ఈఓ కె.శ్రీకాంత్‌ను నేలకొండపల్లి మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీరాజగోపాలస్వామి దేవాలయం, బోదులబండ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం, చెరువుమాదారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయాల ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఖమ్మం పర్యవేక్షకురాలిగా ఉన్న రెంటాల సమతకు ముదిగొండ మండలం వల్లాపురం శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానం, ముత్తారం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, చిరుమర్రి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, అమ్మపేట శ్రీ వెలుగొండ వేణుగోపాల స్వామి దేవస్థానం ఈఓ బాధ్యతలను అదనంగా అప్పగించారు.

కళ్లు, నోట్లో పురుగు మందు..

యువకుడికి తీవ్ర అస్వస్థత

కారేపల్లి: ఇద్దరు వ్యక్తులు పాతకక్షల నేపథ్యాన ఘర్షణ పడగా ఓ వ్యక్తి ఎదుటి వ్యక్తిపై పురుగుమందు పోయడంతో కళ్లు, నోటిలో పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. సదరు వ్యక్తి ఓ కంటిచూపు కోల్పోగా ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన 14వ తేదీన జరగగా, శనివారం వెలుగు చూసింది. మండలంలోని మంగళితండా గ్రామంలో ఈనెల 14న ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో ఓ వ్యక్తి పురుగుమందుతో దాడిచేయగా ఇంకో వ్యక్తి కళ్లు, నోటిలో పడింది. దీంతో పెద్దమనుషులు కలగచేసుకుని ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించినా ఫలితం లేకపోగా దాడికి గురైన వ్యక్తి ఓ కంటిచూపు పోయింది. అలాగే, పురుగుమందు ప్రభావం కిడ్నీలపై పడడంతో తీవ్రఅస్వస్థతకు గురికాగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

ఆటోడ్రైవర్‌ను ఆదుకోరూ..

- ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆశీర్వాదం



వేడుకుంటున్న ఆశీర్వాదం

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్ల గ్రామానికి చెందిన ఇనపనూరి ఆశీర్వాదం ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా తీవ్ర ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆయన పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. సరైన వైద్యం చేయించుకునే స్థోమత లేక దాతల చేయూత కోసం ఎదురుచూస్తున్నాడు. ఆటో నడిపితే వచ్చే ఆదాయం కుటుంబాన్ని పోషించే ఆయన ఇప్పుడు పనిచేసే పరిస్థితి లేక.. చికిత్స చేయించుకునే మార్గం లేక దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నాడు. ఆయనకు భార్య వెంకటమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాయం చేయాలనుకునే వారు 98484 03332, 81063 46866 నంబర్లలో సంప్రదించాలని ఆశీర్వాదం కుటుంబీకులు కోరారు.

చెరువు కట్టనూ తవ్వేస్తున్నారు..

ఆగని మట్టి మాఫియా..



చెరువుకట్టను తొవ్వుతున్న జేసీబీ

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట లేకుండా పోతోందనడానికి శనివారం జరిగిన ఓ ఘటనే నిదర్శనం. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నీటి కుంటలు, చెరువులు నిర్మిస్తుంటారు. 2014లో గుర్రాలచెరువు, మొద్దులగూడెం గ్రామాల మధ్య సుమారు 2 ఎకరాల్లో చెరువును నిర్మించారు. శనివారం ఓ జేసీబీ, కొన్ని ట్రాక్టర్ల సాయంతో ఈ చెరువు కట్టను తవ్వేసి మట్టిని అశ్వారావుపేటకు తరలించారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోలేదనే చర్చ జరుగుతోంది. అశ్వారావుపేటలో మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేసే నాథుడేలేడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా.. మట్టి తవ్వకం సమాచారం అందగా సిబ్బందిని పంపించామని.. అప్పటికే అక్కడున్న జేసీబీ, ట్రాక్టర్లు తరలించేశారని తెలిపారు. మట్టి తవ్వకాలు, రవాణా చేపడితే కఠిన చర్యలు చేపడతామని.. ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులను చూపుతున్న అధికారులు

భద్రాచలంటౌన్: పట్టణంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమంగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేశ్ శనివారం వివరాలు వెల్లడించారు. ఏపీ సరిహద్దు నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నారనే సమాచారంతో కూనవరం రోడ్డులో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. ఆపి తనిఖీ చేయగా 10 కిలోల గంజాయి లభ్యమైంది. హైదరాబాద్‌లో ఫుడ్ డెలవరీ బాయ్‌గా పనిచేస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా వల్లెకుంటకు చెందిన బొమ్మ నితిన్ గంజాయికి అలవాటై వచ్చే ఆదాయం సరిపోక గంజాయి విక్రయించి అధిక మొత్తంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అప్పటికే గంజాయికి బానిసలైన తన స్నేహితులు జనగామకు చెందిన ఎనగందుల శశాంక్, వరంగల్ జిల్లా భీమదేవరపల్లి మండలం చంటయ్యపల్లి గ్రామానికి చెందిన భూక్యా సంపత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రామానుజవరం గ్రామానికి చెందిన శ్రీరామ్ షణ్ముఖశ్రీతో పాటు మరో మైనర్‌తో కలిసి ముఠాగా ఏర్పడినట్లు విచారణలో తేలిందని సీఐ వివరించారు. వారు ఓ కారును లాంగ్ టూర్ పేరుతో అద్దెకు తీసుకొని సీలేరులో గంజాయిని కొనుగోలు చేసి తిరుగు ప్రయాణంలో పట్టుబడ్డారని చెప్పారు. కారును, గంజాయిని సీజ్ చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, గంజాయి విలువ సుమారు రూ.6 లక్షల వరకు ఉంటుందని సీఐ రమేశ్ వివరించారు.

గుంతలో జారి పడిన గోవు



కేఎస్‌పీ రోడ్‌లో తీసిన గుంతలో పడిన గోవు

పాల్వంచ: విద్యుత్ లైన్ టవర్ ఏర్పాటు కోసం తీసిన గుంతను పూడ్చకుండా ఉంచడంతో అందులో గోవు పడి నరకయాతన పడింది. స్థానికుల కథనం మేరకు.. నెలన్నర కిందట కేఎస్‌పీరోడ్‌లో విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం 11 అడుగుల గుంతను తీసి వదిలేశారు. అందులో టవర్ ఏర్పాటు చేయకుండా వదిలేయడంతో శనివారం ఓ గోవు ఆ గుంతలో పడింది. లోతు ఎక్కువగా ఉండటంతో నీరు కూడా చేరి ఉండగా గోవు నరకయాతన పడింది. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోక పోవడంతో స్థానికులే కర్రలకు తాళ్లు కట్టి గోవును బయటకు లాగారు. వెంటనే స్థానికులు గుంతపై రేకులు అడ్డుగా పెట్టి మూసివేశారు.

బెల్ట్ దుకాణదారుడిపై కేసు

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఓ బెల్ట్ దుకాణదారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామ పంచాయతీ పరిధి లోని కొత్తూరు గ్రామానికి చెందిన ఫణింద్ర కొంతకాలంగా బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్నాడు. పోలీసులు దుకాణంలో తనిఖీ చేసి, రూ.15,543 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఫణింద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బెల్ట్‌షాపులపై దాడులు

బూర్గంపాడు: మండలంలోని బెల్ట్‌షాపులపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. లక్ష్మీపురంలోని మూడు బెల్ట్‌షాపుల్లో రూ.25వేల విలువైన లిక్కర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ కేసు నమోదు

దమ్మపేట: మండలంలోని కొడిసెలగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో నగదు పోగొట్టుకున్న ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొడిసెలగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈనెల 9న వాట్సాప్‌లో వచ్చిన ఒక లింక్‌ను క్లిక్‌చేశాడు. వెంటనే అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.46,000 గుర్తు తెలియని ఖాతాకు బదిలీ అయినట్లు గుర్తించాడు. సైబర్‌క్రైమ్ టీంకు ఫోన్ చేసి సమాచారం అందించగా, నిందితుడి ఖాతాలో ఉన్న రూ.26,000ను హోల్డ్‌లో ఉంచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

పాల్వంచరూరల్: కిన్నెరసాని వాగునుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని జగన్నాథపురం వద్ద శనివారం ఎస్ఐ శ్రీనివాస్ వాహనా లు తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమ తులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని సీజ్‌చేశారు. డ్రైవర్ వాడే నవీన్, యజమాని శరత్‌కుమార్(నాని) పై కేసునమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్య, ఉపాధి కోసం ఉద్యమం



సభలో మాట్లాడుతున్న ఆవుల అశోక్

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థి, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయని బీజేపీని నిలదీయాలని.. భగత్‌సింగ్ స్ఫూర్తితో పాలకులపై ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర మాజీ నాయకుడు ఆవుల అశోక్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యాన శనివారం భగత్‌సింగ్ వర్ధంతి సభ నిర్వహించగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. గత పదేళ్లుగా పాలిస్తున్న బీజేపీ రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని తుంగలో తొక్కిందని ఆరోపించారు. ఈమేరకు విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంచుకుని భగత్ సింగ్ బాటలో ముందుకు సాగాలని సూచించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు మంద సురేష్, జిక్కుల భరత్, రవీందర్, కరణ్, శ్రీకాంత్, లాల్ పాషా, శ్రీను పాల్గొన్నారు.

నవతరానికి స్ఫూర్తి దాత...

బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన భగత్‌సింగ్ స్వాతంత్ర్య సంగ్రామంలో యువతకు స్ఫూర్తిగా నిలిచారని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకుడు పోటు ప్రసాద్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన భగత్‌సింగ్ వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ అంతరాల వ్యవస్థను ధ్వంసం చేస్తూ సమాజ మార్పు కోసం భగత్‌సింగ్ స్ఫూర్తిగా ఉద్యమించాలని సూచించారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు నానబాల రామకృష్ణ, మడుపల్లి లక్ష్మణ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, షేక్ జానీమియా, నర్సింహారావు, శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, కళావతి, రామకృష్ణ, తాటి వెంకటేశ్వర్లు, దొండపాటి రమేష్ పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీస్

అభినందించిన ప్రజలు



కిషన్‌కు సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుల్ నాగరాజు

ఇల్లెందురూరల్: మండలంలోని ఇల్లెందు – మహబూబాబాద్ ప్రధాన రహదారిలో కోటిలింగాల మూలమలుపు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముకుందాపురం గ్రామానికి చెందిన శంకర్, ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన సాయికి తీవ్ర గాయాలయ్యాయి. ఇల్లెందు నుంచి బైక్‌పై వస్తున్న వీరు కోటిలింగాల వద్ద రోడ్డు పక్కన ఉన్న రాళ్లను ఢీకొట్టడతో ఈ ప్రమాదం జరిగింది. అదే సమయంలో గార్ల మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన కిషన్ బైక్‌పై వెళ్తూ ప్రమాద దృశ్యాన్ని తిలకిస్తూ ఆగి ఉన్న మరోబైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కిషన్ రోడ్డు పక్కనే ఉన్న రాళ్లమీద పడటంతో కోమాలోకి వెళ్లాడు. అక్కడే ఉన్న ఇల్లెందు పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నాగరాజు సీపీఆర్ చేసి కిషన్‌ను కాపాడాడు. వెంటనే కిషన్ కోమా నుంచి బయటపడటంతో ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తొలుత జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకర్, సాయిలను మహబూబాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శంకర్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి సిఫారసు చేశారు. సీపీఆర్ చేసిన కానిస్టేబుల్ నాగరాజును ప్రజలు అభినందించారు.

ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో శనివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. దంతెవాడ జిల్లాలోని పిడియా పోలీస్‌స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా పోలీసు బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా, పోలీసులు సైతం ఎదురు కాల్పులు జరిపారు. ఈ ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా మృతదేహాలను దంతెవాడకు తరలించారు. అయితే, మృతులను గుర్తించాల్సి ఉంది.

ప్రెజర్‌బాంబు పేలి జవాన్లకు తీవ్ర గాయాలు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో పోలీసులు కూంబింగ్‌కు వెళ్లి వస్తుండగా.. మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబు పేలడంతో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. దంతెవాడ, సుక్మా, బీజాపూర్ జిల్లాల సరిహద్దు కిరండోల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారంపై అందిన సమాచారంతో బస్తర్ ఫైటర్స్, డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్‌కు వెళ్లాయి. తిరిగి శనివారం వస్తుండగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబులను బస్తర్ ఫైటర్స్ విభాగానికి చెందిన జవాన్లు తొక్కగా అవి పేలాయి. దీంతో జవాన్లు రాజేష్, వికాస్‌కు తీవ్రగాయాలు కాగా, వారికి పిడియాలో ప్రథమ చికిత్స అనంతరం ప్రత్యేక హెలీకాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలించారు. ప్రస్తుతం వీరిద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

షెల్ కంపెనీతో సీఎం రమేశ్ టోకరా

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన సన్నిహితుడు పి. నాగేశ్వరరావు పక్కా స్కెచ్‌తో పాల్పడిన ఈ ఘరానా మోసంపై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. సంతకాలు ఫోర్జరీ చేసి రిత్విక్ స్వాతి అనే బోగస్ కంపెనీ పేరిట సబ్‌కాంట్రక్టు ఒప్పంద పత్రాలు సృష్టించి మరీ ఈ మోసానికి తెగబడ్డారు. ఈ మేరకు ప్రముఖ సినీ నటుడు, పీసీఎల్ ఇంటర్‌టెక్ లెన్‌హైడ్రో కన్సార్షియం జాయింట్ వెంచర్ ఆథరైజ్డ్ సిగ్నేచరీగా ఉన్న తొట్టెంపూడి వేణు, కేంద్ర మాజీమంత్రి కావూరి సాంబశివరావు కుమారుడు కావూరి భాస్కర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు గత ఏడాదే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారిపై ఐపీసీ సెక్షన్లు 420, 468, 471 కింద కేసు నమోదు చేశారు. ఫోర్జరీ సంతకాలతో సీఎం రమేశ్ పాల్పడిన ఈ మోసానికి సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలను తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీసులకు శనివారం అందించారు. కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు. ఈ ఘరానా మోసం వివరాలిలా ఉన్నాయి..

పీసీఎల్ కన్సార్షియంకు తెహ్రీ హైడ్రో ప్రాజెక్టు..

ఉత్తరాఖండ్‌లో తెహ్రీ హైడ్రో ప్రాజెక్టు వద్ద సివిల్ ప్రాజెక్టు కాంట్రాక్టును పీసీఎల్ ఇంటర్‌టెక్ కన్సార్షియం దక్కించుకుంది. ఈ మేరకు తెహ్రీ హైడ్రో



డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీహెచ్‌డీసీ)తో 2002లో ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం ఆ ప్రాజెక్టు వ్యవహారాలను నిర్వహించేందుకు పీసీఎల్ కన్సార్షియం తమ ప్రతినిధిగా కావూరి భాస్కర్‌రావును జనరల్ పవర్ ఆఫ్ అటర్నీ (జీపీఏ) ద్వారా నియమించింది. కొంతకాలం ప్రాజెక్టు పనులు చేపట్టిన తరువాత పీసీఎల్ కన్సార్షియంకు టీహెచ్‌డీసీతో విభేదాలు తలెత్తాయి. దీంతో ఆ వ్యవహారం న్యాయస్థానం ఆర్బిట్రేషన్‌కి చేరింది. ఢిల్లీ కోర్టులో ప్రస్తుతం వ్యాజ్యం కొనసాగుతోంది. పీసీఎల్ కన్సార్షియంకు చెల్లించాల్సిన బిల్లుల మొత్తాన్ని టీహెచ్‌డీపీ న్యాయస్థానంలో డిపాజిట్ చేసింది.

ఫోర్జరీ సంతకాలతో సీఎం రమేశ్ మోసం..

ఇలా ఓ వైపు ఈ న్యాయ వివాదం కొనసాగుతుండగా.. సీఎం రమేశ్ గుట్టుచప్పుడు కాకుండా ఓ కథ నడిపించారు. పి. నాగేశ్వరరావు అనే వ్యక్తి తమ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని పీసీఎల్ కన్సార్షియం 2011లో గుర్తించింది. ఆ మేరకు ఆయన ఓ జీపీఏను కూడా సృష్టించారని తెలుసుకుని షాక్‌కు గురైంది. అంతేకాదు.. తమ కన్సార్షియం ప్రతినిధిగా చెప్పుకుంటూ ఆయన సీఎం రమేశ్‌కు చెందిన బోగస్ కంపెనీ రిత్విక్ స్వాతికి టీహెచ్‌డీపీ ప్రాజెక్టు సబ్ కాంట్రాక్టును ఇచ్చినట్లు పత్రాలు సృష్టించారు. వాటిని చూపిస్తూ టీహెచ్‌డీపీ ప్రాజెక్టు బిల్లులు పొందేందుకు సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ స్వాతి కంపెనీ వ్యవహారం నడిపింది. పి. నాగేశ్వరరావు అనే వ్యక్తి కేవలం పరిమిత కాల జీపీఏతో పీసీఎల్ కన్సార్షియం ప్రతినిధిగా టీహెచ్‌డీపీ ప్రాజెక్టు పనులను పర్యవేక్షించారు. కానీ, ఆయన వ్యవహారశైలి నచ్చక ఆ జీపీఏ కాలపరిమితి ముగియగానే ఆయన్ని తొలగించారు. అయినాసరే.. తమ సంతకాలు ఫోర్జరీ చేసి మరో జీపీఏ సృష్టించుకోవడంతో పాటు.. సీఎం రమేశ్‌కు చెందిన బోగస్ కంపెనీ రిత్విక్ స్వాతితో తమ కంపెనీ పేరుతో సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకున్నట్లుగా పీసీఎల్ కన్సార్షియం గుర్తించింది. ఈ ఒప్పందంలో పి.నాగేశ్వరరావు తన చిరునామాలో ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేటను పేర్కొన్నారు. దీనిపై పీసీఎల్ కన్సార్షియం చిలకలూరిపేట పోలీసులను ఆశ్రయించగా ఆయన తప్పుడు చిరునామా ఇచ్చారని గుర్తించారు. అసలు చిరునామాను కూడా గుర్తించి వెల్లడించారు. షెల్ కంపెనీ ద్వారా నిధులు కొల్లగొట్టేందుకు ఉద్దేశించిన ఆ బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం ద్వారా సీఎం రమేశ్, పి.నాగేశ్వరరావు ఈ మోసానికి పాల్పడ్డట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో పీసీఎల్ కన్సార్షియం ఈ విషయాన్ని ఈ-మెయిల్ ద్వారా టీహెచ్‌డీపీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందిందని టీహెచ్‌డీపీ ఉన్నతాధికారులు నిర్ధారించారు.

సీఎం రమేశ్ రూ.450 కోట్లు కొల్లగొట్టారు : కావూరి భాస్కర్‌రావు

'పీసీఎల్ జాయింట్ వెంచర్ కంపెనీకి సంబంధించి సీఎం రమేశ్ ఫోర్జరీకి పాల్పడ్డారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ఏసీపీ ఎదుటు హాజరై వాంగ్మూలం ఇచ్చాను. దాదాపు అరగంట పాటు నా స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. ఈ ఫోర్జరీ ద్వారా సీఎం రమేశ్ దాదాపు రూ.450 కోట్లు స్వాహా చేశారు. దీనికి సంబంధించి కోర్టులోనూ ఓ కేసు నడుస్తోంది. సీఎం రమేశ్‌పై సీబీఐ దర్యాప్తు జరిగితే రూ.వేల కోట్ల స్కాంలకు సంబంధించిన విషయాలు బయటకొస్తాయి'.. అని కావూరి భాస్కర్‌రావు మీడియాకు చెప్పారు.

మరోవైపు.. ఆ సబ్ కాంట్రాక్టు ఒప్పంద పత్రాలను కావూరి భాస్కర్‌రావు ట్రూత్‌ల్యాబ్ అనే ప్రైవేటు సంస్థ ద్వారా ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించారు. పి. నాగేశ్వరరావు, రిత్విక్ స్వాతి కంపెనీ ఉద్దేశపూర్వకంగా సంతకాలు ఫోర్జరీ చేసినట్లు ఆ పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఈ అంశాన్ని పీసీఎల్ కన్సార్షియం ప్రతినిధులైన తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్

ఫోరెన్సిక్ పరీక్షల్లో ఫోర్జరీ నిర్ధారణ..

స్వాతి కంపెనీ ప్రధాన కార్యాలయంలోనే ఫోర్జరీ సంతకాలతో బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకున్నారని తేలింది. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులకు గత ఏడాది నవంబరు 4న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి ఫోర్జరీ సంతకాల విషయాన్ని నిర్ధారించాలని కోరారు. తప్పుడు ఒప్పందంతో తమ కంపెనీని మోసం చేసిన సీఎం రమేశ్, పి. నాగేశ్వరరావులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరి మోసానికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉండటంతో వారిపై హైదరాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరెడ్డిని శనివారం కలిసి ఈ కేసు దర్యాప్తు వేగవంతం చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కేసుకు సంబంధించి తాము సేకరించిన మరిన్ని కీలకపత్రాలను కూడా పోలీసులకు అందించారు.

సరైన కారణం ఉండాలి

▶ మొదటి పేజీ తరువాయి

కారణంతో జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 69 కింద నిర్బంధం సరికాదని వ్యాఖ్యానించారు. జీఎస్టీ అంశంలో వ్యాపారులను అరెస్టు చేయడానికి అనుమతించే ముందు అందుకు కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. శనివారం ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ (సౌత్‌జోన్), తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ పన్నుల సదస్సుకు జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడం రెండు రకాల సంతోషానిచ్చింది. పన్ను అంశంపై అనుభవం ఉన్న న్యాయవాదిగా ఇంత మంది ట్యాక్స్ ప్రాక్టీషనర్ల మధ్య పాల్గొనడం ఒకటైతే.. హైదరాబాద్‌ను సందర్శించడం మరొకటి. ఇక్కడ న్యాయమూర్తిగా, ప్రధాన న్యాయమూర్తిగా పనిచేయడంతో నగరంతో అనుబంధం ఏర్పడింది. హైదరాబాద్ వస్తే ఇంటికి వచ్చినట్లే ఉంటుంది. ఇలాంటి అవకాశాలు వచ్చినప్పుడు వీలున్నంత వరకు నగరాన్ని సందర్శిస్తా'అని చెప్పారు. ఎవరైనా ఆదాయపు పన్ను నివేదిక సమర్పిస్తే.. అది తప్పుడు నివేదిక అని పూర్తిగా నమ్మితే మాత్రమే అసెస్‌మెంట్‌ను తిరిగి ప్రారంభించాలని సుప్రీంకోర్టు గతంలో పేర్కొందని ఆయన వివరించారు.

'ఆయుధాన్ని'దుర్వినియోగం చేయొద్దు..

'సీజీఎస్టీలోని సెక్షన్ 69, సెక్షన్ 83.. రాష్ట్ర జీఎస్టీలోని ఇవే నిబంధనలు అధికారులకు కఠిన అధికారాలను అందించాయి. ఈ రెండు నిబంధనలు రెవెన్యూ చేతిలో బలమైన ఆయుధాలు. వీటిని జాగ్రత్తగా, తక్కువగా ఉపయోగించాలి. ఆయుధాన్ని అతిగా ప్రయోగించినా.. దుర్వినియోగపరచినా.. దాని శక్తిని కోల్పోతుందని మనకు తెలుసు. ఇదే జరిగితే అధికారులపై నమ్మకం పోతుంది. ఒక నిబంధన ఎంత కఠినంగా ఉంటే న్యాయపరమైన పరిశీలన కూడా అంతే కఠినంగా ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలి'అని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సూచించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. 'పన్ను వసూలు అనేది సమాజానికి నాడు, నేడు కీలకమైన అంశాల్లో ఒకటి. ఇది ఏ దేశంలో అయినా ప్రభుత్వాన్ని నడపడానికి ఎంతో అవసరం. శతాబ్దాల నుంచి పన్ను విధింపు చట్టాలు మారుతూ వస్తున్నాయి. ఒక తేనెటీగ పువ్వు నుంచి మకరందాన్ని ఎలా సేకరిస్తుందో పన్ను వసూలు కూడా అంతే సున్నితంగా జరగాలని కౌటిల్యుడు వందల సంవత్సరాల క్రితమే చెప్పాడు. ఆధునిక భారత్‌లో కొత్త పన్ను విధానాలతో దేశం పురోగతిలో పయనిస్తోంది'అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తుకారాంజీ, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి, జస్టిస్ అనిల్‌కుమార్, అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహ శర్మ, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయ్‌దేవ్, టీటీపీఏ అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు, ఏఐఎఫ్‌టీపీ (సౌత్‌జోన్) చైర్మన్ రామరాజు శ్రీనివాస్‌రావు, సుధీర్ వీఎస్, మహమ్మద్ ఇర్షాద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చదరపు మీటర్‌కు రూ.6 వేలు చెల్లించండి

- 'ఏపీఐఐసీ' ప్లాట్ లబ్ధిదారుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జీడిమెట్ల లోని ఇండస్ట్రియల్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్-2లో ప్లాట్ పొందిన లబ్ధిదారు రష్మీ అభిచందని చదరపు మీటర్‌కు రూ.6 వేలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. మార్కెట్ విలువ గజానికి రూ.12 వేలుగా ఉండగా, ఇప్పటికే రూ.6 వేలు చెల్లించారు కాబట్టి మిగిలిన మొత్తాన్ని 3 నెలల్లో చెల్లించాలని అభిచందనికి స్పష్టం చేసింది. 'జీడిమెట్లలోని ఇండస్ట్రియల్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్-2లో రష్మీ అభిచందనికి 523 గజాల ప్లాట్‌ను (నంబర్ 12) తక్కువ ధరకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) కేటాయించడం చట్టవిరుద్ధం. ఏపీఐఐసీ ఉద్యోగి అభిచందని ప్రొబేషన్ పీరియడ్‌లో ఉండగా ప్లాట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తొలుత ఆమెకు 265 చదరపు మీటర్ల ప్లాట్ నం.15ను తాత్కాలికంగా కేటాయించారు. చదరపు మీటర్‌కు రూ.6,000 చెల్లించారు. తర్వాత 523.50 చదరపు మీటర్ల ప్లాట్ నంబర్ 12కోసం ఆమె అభ్యర్థించగా కేటాయించారు. మొత్తం రూ.31,41,000 చెల్లించి సేల్ డీడ్ పొందారు. చట్టవిరుద్ధంగా ప్లాట్ పొందినందున.. సదరు ప్లాట్‌కు బహిరంగ వేలం నిర్వహించేలా ఏపీఐఐసీకి ఆదేశాలు ఇవ్వాలి. మోసానికి పాల్పడిన రష్మి, మరో ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకోవాలి' అంటూ న్యాయవాది పాశం కృష్ణారెడ్డి తరఫున న్యాయవాది గాడిపల్లి మల్లారెడ్డి 2011లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్‌కు గతంలోనే ఇళ్లు, రెండు ప్లాట్లు ఉన్నాయి. భూసేకరణ జరిపి ఏపీఐఐసీ పరిశ్రమలకు కేటాయించాలి తప్ప.. ఇళ్ల స్థలాలు ఇవ్వడం కూడా సరికాదు. అది కూడా ప్రొబేషన్‌లో ఉన్న ఉద్యోగికి కేటాయించడం సమర్థనీయం కాదు. ఇలా ప్లాట్ కేటాయించడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది' అని వాదనలు వినిపించారు. అభిచందని తరఫు న్యాయవాది వాదిస్తూ.. పిటిషన్‌ను ఉద్దేశపూర్వకంగా దాఖలు చేశారని, ప్రజా ప్రయోజనం లేదని వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. భూమి కేటాయింపులో ఎలాంటి జోక్యం అవసరం లేదని అభిప్రాయపడింది. ప్లాట్ మార్కెట్ విలువలో సగం మొత్తాన్ని గతంలో చెల్లించినందున.. మిగిలిన మొత్తాన్ని 3 నెలల్లోగా చెల్లించాలని లబ్ధిదారును ఆదేశించింది.

వసతి గృహాల బకాయిలు రూ.343 కోట్లు!

- తొమ్మిది నెలలుగా విడుదల కాని డైట్ చార్జీలు
- దీంతో నిర్వహణ కష్టంగా మారిందంటున్న అధికారులు
- అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం పెడుతున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాల్లో బకాయిలు పేరుకుపోయాయి. తొమ్మిది నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ తలకుమించిన భారంగా మారిందంటూ వసతిగృహ సంక్షేమాధికారులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల విడుదలకు గ్రీన్‌చానల్ ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు పైసా విడుదల కాని పరిస్థితి ఉందని అంటున్నారు. సంక్షేమ వసతిగృహాలకు కనీసం డైట్ చార్జీలకు సంబంధించిన బిల్లులు కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. మరో వారం రోజుల్లో 2023-24 ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో ఆలోపు నిధులు విడుదల కోసం వసతిగృహాల నిర్వహణ అధికారులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో 1,550 హాస్టళ్లున్నాయి. వీటి పరిధిలో 2.28 లక్షల మంది విద్యార్థులున్నారు. ఈ మూడు సంక్షేమ శాఖలకు సంబంధించిన హాస్టళ్ల బిల్లులు దాదాపు రూ.343 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అప్పులు చేసి నిర్వహణ..

వసతిగృహాల నిర్వహణకు సంబంధించి చెల్లింపులను ప్రభుత్వం గ్రీన్‌చానల్ పద్ధతిలో ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. అయితే ఈ నిర్ణయం ఇప్పటివరకు అమలు కాలేదు. ఇది వరకు వసతిగృహాలకు సంబంధించిన చెల్లింపులు ప్రతి త్రైమాసికంలో ఒకసారి జరిగేవి. ఒక్కోసారి చెల్లింపులు నిలిచినప్పటికీ.. ఆ తర్వాతి త్రైమాసికంలో ప్రాధాన్యత క్రమంలో నిధులను విడుదల చేయడంతో నిర్వాహకులకు కొంత ఊరట దక్కేది. కానీ గత తొమ్మిది నెలలుగా సంక్షేమ వసతిగృహాలకు సంబంధించిన బిల్లులు క్లియర్ కాలేదు. గతేడాది జూన్‌లో నిధులను విడుదల చేసిన ప్రభుత్వం.. ఆ తర్వాతి నుంచి చెల్లింపులన్నీ నిలిపివేసింది. దీంతో నిర్వాహకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెలా కిరాణా సరుకులు, కూరగాయలు, ఇతర సరుకుల కోసం వసతిగృహ సంక్షేమాధికారులు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. కొన్నిచోట్ల వ్యాపారులకు తర్వాత డబ్బులు చెల్లిస్తామని ఇప్పటివరకు సరుకులు తీసుకోగా.. ఇప్పుడు బకాయిలు చెల్లిస్తేనే సరుకులిస్తామని వ్యాపారులు తేల్చిచెప్పడంతో సంక్షేమాధికారులు తలపట్టుకుంటున్నారు.



విద్యార్థుల భోజనంపై ప్రభావం..

హాస్టళ్లకు నిధులు విడుదల చేయకపోవడంతో ఆ ప్రభావం విద్యార్థులకు అందించే భోజనంపైన తీవ్రంగా పడుతోంది. అరువు పద్ధతిలో సరుకులు తీసుకువస్తున్నప్పటికీ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వారంలో రెండ్రోజులు ఉడికించిన గుడ్లు, ఒక రోజు మాంసాహారం ఇవ్వాల్సి ఉండగా.. చాలా హాస్టళ్లలో పప్పు, చారు, కూరగాయలతో కూడిన ఆహారాన్నే అందిస్తున్నారని వాపోతున్నారు.

జిల్లా వార్తలు

ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలి

- డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్

మణుగూరు రూరల్: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను ప్రమాద రహితంగా తీర్చిదిద్దేలా ప్రతీ కార్మికుడు అంకితభావంతో పనిచేయాలని డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాజగోపాల్ సూచించారు. చిక్కుడుగుంటలో ఉన్న బీటీపీఎస్‌లో శనివారం తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన జాతీయ భద్రతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ కర్మాగారంలో ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఈ బి.బిచ్చన్న మాట్లాడుతూవిధి నిర్వహణలో ప్రతీఒక్కరు రక్షణ సూత్రాలను పాటించాలని, నిబద్ధతతో పని చేస్తూ సంస్థ పురోగతికి పాటుపడాలని తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన కార్మికులకు సీఈ జ్ఞాపికలు అందజేశారు. సూపరింటెండెంట్ ఇంజనీర్లు రమణమూర్తి, పార్వతి, రమేష్‌బాబు, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బాబురావు, విజిలెన్స్ డీఎస్పీ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శనివారం భక్తులు విరాళం అందజేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన కొండపల్లి వెంకటేశ్వరరావు-రాధాదేవి దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు.. స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారికి స్వామి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఉద్యోగి సాయిబాబా, అర్చకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని గాంధీనగర్‌కాలనీ వద్ద శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వత్సవాయికి చెందిన గుర్రం శేషగిరిరావు(50) ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి వత్సవాయి వెళ్తున్నాడు. అదే సమయాన బోనకల్ మండలం మోటమర్రికి చెందిన వెంకటరావు మోటమర్రి నుంచి ఖమ్మం వైపు వెళ్తుండగా గాంధీనగర్‌కాలనీ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగానే శేషగిరిరావు మృతి చెందాడు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

ఆటాడుకుందాం.. రా!

- భద్రాద్రి జిల్లాలో లాన్ టెన్నిస్ కోర్టులు సిద్ధం
- రూ.1.25కోట్లతో సింథటిక్, క్లే మైదానాలు
- అధునాతన సౌకర్యాలతో అందుబాటులోకి...
- భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించే అవకాశం



పాల్వంచలో సిద్ధమైన లాన్ టెన్నిస్ కోర్టు

పాల్వంచ: క్రీడారంగంలో మొదటి నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఏజెన్సీ జిల్లాలో ఇప్పటికే ఐటీడీఏ ఆధ్వర్యాన క్రీడా పాఠశాల కొనసాగుతుండగా.. అన్ని రకాల ఆటల్లో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్తున్నారు. ఇక అనేక పరిశ్రమలకు నెలవు కావడంతో ఆయా కర్మాగారాల ఉద్యోగులు సైతం క్రీడల్లో సత్తా చాటుతున్నారు. ఇదిలా ఉండగా లాన్ టెన్నిస్ క్రీడకు సైతం జిల్లాలో నానాటికీ ప్రాధాన్యత పెరుగుతోంది. ఇక్కడి జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ క్రీడను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుండగా.. ఇప్పటికే నాలుగు లాన్ టెన్నిస్ కోర్టులు మంజూరు కావడం విశేషం. కొత్తగూడెం ప్రగతి మైదానంలో రెండు సింథటిక్ కోర్టులు, పాల్వంచలోని శ్రీనివాస కాలనీ మినీ స్టేడియం ఒక సింథటిక్, ఒక క్లే కోర్టును గత కలెక్టర్ అనుదీప్ మంజూరు చేశారు. ఒక్కో కోర్టు నిర్మాణానికి రూ.25లక్షల చొప్పున నిధులు వెచ్చించారు. కొత్తగూడెంలో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి, పాల్వంచలో డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ద్వారా నిర్మాణాలు పూర్తి చేశారు.

నానాటికీ పెరుగుతున్న ఆసక్తి..

జిల్లాలో లాన్ టెన్నిస్ క్రీడపై ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే సుమారు 200 మంది క్రీడాకారులు ఇందులో ప్రావీణ్యం సాధించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారుల్లో మొదటి పది స్థానాల్లో భద్రాద్రి జిల్లా క్రీడాకారులు ఉండడం



కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో జెన్‌కో యాజమాన్యం ఏర్పాటుచేసిన కోర్టు

విశేషం. ఇటీవల కొత్తగూడెంలోని కోర్టులను ప్రారంభించగా, పాల్వంచలో మాత్రం ఎన్నికల కోడ్ నేపథ్యాన వాయిదా పడింది. క్రీడా ప్రాంగణాలు సిద్ధమైన తరుణాన మరింత మంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

కేటీపీఎస్‌లో రూ.20 లక్షలతో నిర్మాణం పూర్తి..

పాల్వంచలోని కేటీపీఎస్ స్పోర్ట్స్ కౌన్సిల్ వినతి మేరకు జెన్‌కో ఉన్నతాధికారులు సైతం క్రీడాకారులను ప్రోత్సహించాలనే భావనతో రూ.20 లక్షలను మంజూరు చేశారు. ఈ నిధులతో కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో అధునాతన లాన్ టెన్నిస్ కోర్టులను తీర్చిదిద్దారు. ఇక్కడ ఇటీవలే జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ లాన్ టెన్నిస్ క్రీడా పోటీలను సైతం నిర్వహించారు. విధినిర్వహణలో తలమునకలయ్యే ఉద్యోగులు క్రీడల్లోనూ రాణించేలా ఇక్కడ కోర్టులు ఏర్పాటు చేసినట్లు స్పోర్ట్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వరరావు తెలిపారు.

లాన్ టెన్నిస్‌లో తీర్చిదిద్దడమే లక్ష్యం



లాన్ టెన్నిస్‌పై జిల్లాలో పలువురికి ఆసక్తి ఉంది. అయితే హైదరాబాద్‌కు వెళ్లి ప్రాక్టీస్ చేయాలంటే ఇబ్బంది ఎదురవుతుండడంతో జిల్లాలో కోర్టుల ఏర్పాటుకు కృషి చేశాం. గత కలెక్టర్ అనుదీప్ ప్రత్యేక చొరవతో కోర్టులకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుత కలెక్టర్ ప్రియాంక అల సైతం ఎంతో సహకరిస్తున్నారు. ఇప్పటికే కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో మంచి క్రీడా మైదానం అందుబాటులోకి వచ్చింది. ఆసక్తి ఉన్న వారికి లాన్‌టెన్నిస్‌లో మెరుగైన శిక్షణ అందేలా చూస్తూ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దడమే లక్ష్యం.

– డాక్టర్ గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి, లాన్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి

మూడు జిల్లాల స్థాయి ఎడ్లబండి పూటీ లాగుడు పోటీలు

ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో శ్రీలంకమ్మ తల్లి, శ్రీఅక్కమ్మ పేరంటాళ్ల శ్రీరామలింగయ్య స్వామి వార్ల తిరునాళ్ల సందర్భంగా శనివారం ఎడ్లబండి పూటీ లాగుడు పోటీలు నిర్వహించారు. ఆలయ సమీపాన కట్లేరులో నిర్వహించిన పోటీల్లో ఖమ్మం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి 20 జతల ఎద్దు పాల్గొన్నాయి. పరిసర గ్రామాల ప్రజలు హాజరై పోటీలు తిలకించగా.. తిరునాళ్లలో భాగంగా జలబిందెల కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో రంగులు చల్లుకుని ఊరేగింపు చేశారు. ఆలయ అర్చకులు వేమిరెడ్డి వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. - ఎర్రుపాలెం



పోటీలను తిలకిస్తున్న స్థానికులు

బీఆర్ఎస్ డిపాజిట్ గల్లంతు కావాలి

- తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించాల్సిన బాధ్యత ఓటర్లపై..
- మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్



భద్రాచలంలో మాట్లాడుతున్న బలరాంనాయక్

టేకులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ డిపాజిట్ గల్లంతు చేయడంతో పాటు కాంగ్రెస్ గెలిచేలా ఓటర్లు తీర్పు చెప్పాలని కేంద్ర మాజీ మంత్రి, మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ కోరారు. టేకులపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తామని చెప్పారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య దేవానాయక్, నాయకులు కోరం సురేందర్, భూక్యా దళ్‌సింగ్ నాయక్, రాసమల్ల నర్సయ్య, గుండా నర్సింహారావు, నర్సింగ్ లక్ష్మయ్య, ఇస్లావత్ రెడ్యా నాయక్, పోశాలు, మధురెడ్డి, మంగీలాల్, సంజయ్, సరిత, కాలె ప్రసాద్, రవి, సర్దార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బలరాంనాయక్ మాట్లాడాక దళ్‌సింగ్ మాట్లాడడంతో సురేందర్, ఆయన వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేశావని నిలదీయగా, తాను అలా చేయలేదని దళ్‌సింగ్ చెప్పేందుకు యత్నించినా సురేందర్ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతుండగానే బలరాంనాయక్ అక్కడి నుంచి వెళ్లిపోవడం గమనార్హం.

కేంద్ర మంత్రిగా భద్రాద్రి అభివృద్ధికి కృషి చేశా..

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోకజకవర్గ అభివృద్ధికి తాను కేంద్రమంత్రిగా ఉన్న సమయాన కృషి చేశానని.. మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తానని మహబూబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తెలిపారు. భద్రాచలంలోని డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడంతో పాటు తాగు, సాగు నీరు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బలరాంనాయక్ కోరారు. ఈసమావేశంలో నాయకులు బుడగం శ్రీనివాస్, చింతిరాల రవికుమార్, భోగాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ ద్వారానే సుస్థిర పాలన..

- మానుకోట బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న సీతారాంనాయక్

ఇల్లెందు: దేశానికి సుస్థిర పాలన అవసరమని.. అది ప్రధాని నరేంద్రమోదీతోటే సాధ్యమవుతుందని ప్రజలు భావిస్తున్నారని మహబూబాబాద్ లోక్‌సభ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్ తెలిపారు. ఇల్లెందులోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 50ఏళ్ల కాంగ్రెస్ పాలన అవినీతిమయంగా కొనసాగిందని.. కానీ పదేళ్ల బీజేపీ పాలన మచ్చ లేకుండా ఉందని తెలిపారు. ఈమేరకు దేశ ప్రజలు మూడోసారి మోదీని అధికారంలోకి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇక తెలంగాణలో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినప్పుడే రూపురేఖలు మారడంతో పాటు ఉద్యమకారులు ద్రోహం జరుగుతోందని తెలిపారు. తాను ప్రాంతీయ పార్టీలో ఎంపీగా గెలిచి ఎంతో అభివృద్ధి చేశానని, జాతీయ పార్టీ ద్వారా గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని గ్రహించి తనను గెలిపించాలని కోరారు. మహబూబాబాద్ స్థానం బంజారాలకు, ఆదిలాబాద్ స్థానం ఆదివాసీలకు కేటాయించగా.. ప్రత్యర్థులు రాజకీయం చేయాలని చూస్తుండడం సరికాదన్నారు. అనంతరం ఇల్లెందుకు చెందిన వ్యాపారులు పుల్లూరు సతీష్‌కుమార్, ప్రహ్లాద్ తివారీ తదితరులు బీజేపీలో చేరారు. ఈ సమావేశంలో నాయకులు నూకల వెంకటనారాయణరెడ్డి, ముసుగు శ్రీనివాసరెడ్డి, బలగాని గోపీకృష్ణ, నాగరాజు, కొల్లి సంజీవరెడ్డి, రాంచందర్, బాలాజీ, రాంరెడ్డి, భూక్యా శ్రీను, మురళీకృష్ణ, రజత్‌కోరీ పాల్గొన్నారు.